క్లుప్తంగా

నేషనల్ కాన్ఫరెన్స్ శ్రేష్ఠ పోస్టర్ ఆవిష్కరణ



శ్రేష్ఠ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐసీఏఐ ప్రతినిధులు

మద్దిలపాలెం: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విశాఖ బ్రాంచి ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీలలో శ్రేష్ఠ నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నామని ఐసీఏఐ భవన్ బ్రాంచి అధ్యక్షుడు, సీఏ ప్రశాంత్‌కుమార్ పండా తెలిపారు. ఈ మేరకు దీనికి సంబంధించిన పోస్టర్‌ను పిఠాపురం కాలనీలోని బ్రాంచి కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ రోడ్‌లోని ఓ హోటల్‌లో జరిగే నేషనల్ కాన్ఫరెన్స్‌కు ముఖ్యఅతిథిగా ఐసీఏఐ ప్రెసిడెంట్, సీఏ అనికేత్ సునీల్ తలాతి హాజరుకానున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు బాబీరెడ్డికి సత్కారం



బాబీరెడ్డిని సత్కరిస్తున్న అక్కరమాని తదితరులు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు బాబీరెడ్డి (సూర్యనారాయణ రెడ్డి)ని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల సత్కరించారు. ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో బాబీరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిరెడ్డి, కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

రూ.48 లక్షలతో శ్మశానవాటిక ఆధునికీకరణ



శ్మశానవాటికను పరిశీలిస్తున్న గేదెల నాగరాజు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు శివాజీ పార్కు రోడ్డులో ఉన్న శ్మశానవాటికను రూ.48 లక్షలతో ఆధునికీకరిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు తెలిపారు. గురువారం ఆయన జీవీఎంసీ అధికారులతో కలిసి శ్మశానవాటికను పరిశీలించారు. శ్మశానవాటికలో చేపట్టనున్న ఆధునికీకరణ పనులపై ఆరా తీశారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

సినీ సంగీత విభావరి రేపు

సీతమ్మధార: గీత్ సంగీత్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఓసి మనసా.. నీకు తెలుసా.. శీర్షికను సినీ సంగత విభావరి నిర్వహించనున్నట్లు మాజీ ఏడీసీపీ, సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్ ఖాన్ తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర గెస్ట్ హౌస్‌లో గురువారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తేదీ సాయంత్రం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంగీత విభావరి జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన గాయనీ, గాయకులు పలు గీతాలు ఆలపిస్తారని చెప్పారు. సంగీత ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని ఖాన్ కోరారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అపురూప క్షణం.. ఆచార్యులతో పట్టాలు అందుకున్న విద్యార్థులు

ఆనంద హేల..

ఏయూలో బీబీఏ పట్టభద్రుల సందడి



పట్టాలు తీసుకోవడానికి సిద్ధంగా విద్యార్థులు

ఏయూ క్యాంపస్: చదువుపై మక్కువతో ఖండాంతరాలను దాటి వచ్చారు. ఎన్నో సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగారు. భారతీయ వంటకాలు, వస్త్రధారణపై మమకారం పెంచుకున్నారు. స్నేహ బంధంతో ఒక్కటిగా ఎదిగారు. ఏయూలో మూడు సంవత్సరాల బీబీఏ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు.

ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో గురువారం నిర్వహించిన బీబీఏ గ్యాడ్యుయేషన్ డే వేడుకలు ఎంతో సందడిగా సాగాయి. ఈ వేడుకల్లో 15కు పైగా దేశాలకు చెందిన విద్యార్థులు తమ డిగ్రీలు స్వీకరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అడుగిడిన నాటి నుంచి నేటి వరకు తమపై ఆచార్యులు చూపిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు.



చీరకట్టులో విదేశీ యువతులు



వసుధైక కుటుంబం.. మనమంతా ఒక్కటే

చీరకట్టులో కళకళ

విదేశీ వనితలు భారతీయ చీరకట్టుకు ముగ్ధులయ్యారు. గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు వీరంతా భారతీయ సంప్రదాయ చీరకట్టులో హాజరై సందడి చేశారు. పలువురు విద్యార్థులు భారతదేశంలో తాము గమనించిన భిన్నత్వంలో ఏకత్వాన్ని, ఇష్టంగా భుజించిన బిరియాని రుచిని మరువలేమంటూ ఉద్వేగంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంతో తమకున్న అనుభూతులను వారు పంచుకున్నారు. పలువురు భారతీయ విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

‘ర్యాగింగ్‌తో భవిష్యత్ నాశనం’



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ

ఏయూ క్యాంపస్: విద్యార్థులకు ర్యాగింగ్‌కు పాల్పడి తమ అందమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ సూచించారు. గురువారం ఏయూ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడటం, ఇతరులను బాధించడం ఎంతమాత్రం సరికాదన్నారు. విద్యార్థులు తమ సమయాన్ని నూతన జ్ఞానాన్ని పొందడానికి వెచ్చించాలన్నారు. కార్యక్రమంలో రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కె.వి.ఎల్.హిమబిందు, ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, ప్రభుత్వ మానసిక ఆసుపత్రి విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ కె.ప్రభాత్, ఎ.పద్మావతి, న్యాయవాదులు కుప్పిలి మురళీధర్, లక్ష్మి రాంబాబు, బి.హరి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని మృతి



కోమలి (ఫైల్)

అగనంపూడి: క్యాన్సర్‌తో పోరాడుతూ తోటగరువ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయినిగా చేస్తున్న విక్రమ కోమలి (55) గురువారం తుదిశ్వాస విడిచారు. మూడున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయినిగా సేవలు అందించిన ఆమె కూర్మన్నపాలెంలో నివసిస్తున్నారు. పరవాడ మండలంలోని బోనంగి, కొత్తూరు, గంగిరెడ్ల కాలనీ తదితర ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తించి, రెండేళ్ల క్రితం పదోన్నతిపై తోటగరువు హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు. ఆమె ఏడాదిగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. కోమలి మంచి చిత్రకారిణి, గాయని కూడా కావడం విశేషం. గంగిరెడ్ల కాలనీలో ఉపాధ్యాయినిగా పనిచేసే కాలంలో గోడలపై అందమైన చిత్రాలను చిత్రీకరించి అధికారుల మన్ననలు పొందారు. ఆమె మృతిపై పరవాడ మండల ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

మెటలర్జీలో ఉపాధి అవకాశాలు



వీవీఎన్ రాజును సత్కరిస్తున్న కాలేజీ సిబ్బంది

మురళీనగర్: మెటలర్జీలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని సెయిల్‌యూకేలో హెల్త్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజర్ వీవీఎన్ రాజు అన్నారు. ఎన్‌బీఏ గుర్తింపు కోసం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఆధునికంగా తయారు చేసిన మెటలర్జీ ల్యాబ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మెటలర్జీ కోర్ సెక్టార్‌తోపాటు దాని అనుబంధ రంగాల్లో అనేక విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. కాలేజీ పూర్వ విద్యార్థిగా ల్యాబ్‌ల అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వీవీఎన్ రాజును ఘనంగా సత్కరించారు. విభాగాధిపతి డాక్టర్ కె.రత్నకుమార్ పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో రుసుము చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

మెయిన్ లైన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) సౌరభ్ ప్రసాద్ గురువారం డివిజన్ పరిధిలోని మెయిన్ లైన్‌లో గురువారం పర్యటించారు. విశాఖపట్నం-పలాస సెక్షన్ పరిధిలో పూండి నుంచి విశాఖ వరకు విండో ట్రయలింగ్ తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలు, పరిశుభ్రత, నిర్వహణ అంశాలను పరిశీలించారు. విశాఖ రైల్వేస్టేషన్ నుంచి కొత్తవలస, చీపురుపల్లి, తిలారు, శ్రీకాకుళంరోడ్, నౌపడ వరకు ఈ తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా బ్రిడ్జిలు, లెవెల్ క్రాసింగ్స్, మలుపుల్ని పరిశీలించారు. పర్యటనలో డీఆర్‌ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్.కె.పాత్ర, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎంఎస్ఎన్ మూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దిలపాలెం : ఈపీడీసీఎల్ జోన్-1 ఆర్‌సీడీ హాస్పటల్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-1 ఈఈ కె.త్రినాథ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కాగితాలవీధి, లాసన్స్‌బే కాలనీ, మధ్యవారి వీధి, పెదవాల్తేరు, ఫిష్‌మార్కెట్, లాసన్స్‌బే కాలనీ, న్యూ ఎల్‌బీ కాలనీ, ఈస్ట్ పాయింట్ కాలనీ, జాలరిపేట, శ్రామిక నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

‘2వ శనివారం సెలవు పాటించాలి’

ఎంవీపీ కాలనీ: రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ప్రతినెలా రెండో శనివారం సెలవు పాటించాల్సిందేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు, ఇంటర్మీడియెట్ ఆర్‌ఐవోలకు ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. నిబంధనల విషయంలో రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఈ విషయంలో ఏ యాజమాన్యానికి మినహాయింపులేదన్నారు.

ఆళ్వార్‌దాస్ స్కూల్‌లో పెట్టుబడి వేడుక

ఎంవీపీ కాలనీ: స్థానిక ఆళ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం విద్యార్థులు అకడమిక్ సెషన్‌లో భాగంగా పెట్టుబడి వేడుక-2023 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ విజయరవీంద్ర, డైరెక్టర్ దివ్యదాస్, ప్రిన్సిపాల్ శ్రీజ తదితరులు పాల్గొని పలువురు విద్యార్థులకు స్కూల్ కెప్టెన్లుగా నియమిస్తూ బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాలలో క్రమశిక్షణకు అంకిత భావంతో కృషి చేయాలని బ్యాడ్జీలు పొందిన విద్యార్థులకు సూచించారు.

ఘనంగా వెంకన్నకల్యాణోత్సవం



కల్యాణంలో వెంకన్న ఉత్సవమూర్తులకు తలంబ్రాలు ఘట్టాన్ని అర్చకులు

సింహాచలం: వెంకటాద్రిపై గురువారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చాతుర్మాస్య పూజల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆరిలోవలో ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు వినతి

దాబాగార్డెన్స్ : తూర్పు నియోజకవర్గ పరిధి ఆరిలోవ ప్రాంతంలో ఫిష్ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయతో కలిసి గురువారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ సాయికాంత్‌వర్మ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఫిష్‌మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని తెలపారని కోలా గురువులు ఈ సందర్భంగా తెలియజేశారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే ప్రగతి

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలో గల పాఠశాలల్లో గురువారం పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఫార్మేటివ్-1/ క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ పరీక్షలో సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సాధించిన మార్కులతో కూడిన ప్రోగ్రెస్ కార్డులను ఈ సందర్భంగా అందజేశారు. విద్యార్థులు చదువుల్లో ఎలా రాణిస్తున్నారనే విషయమై వారి తల్లిదండ్రులతో క్లాస్ టీచర్, సబ్జెక్టు టీచర్లు సమక్షంలో చర్చించాలని విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అడవివరం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో హెచ్‌ఎం పైడిరాజు మాట్లాడుతూ విద్యార్థుల చదువుల విషయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు.

10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అక్కరమాని తదితరులు

ఎంవీపీ కాలనీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న విద్యా దీవెన, వసతి దీవెనతో పాటు విదేశీ విద్యా దీవెన వంటి సంక్షేమ పథకాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. 10వ వార్డు వివేకానందనగర్‌లో పార్టీ ఇన్‌చార్జి జగ్గుపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కరమాని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుకున్న లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు జగనన్న ప్రభుత్వం తొలిప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులను, పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంక్షేమ ఫలాలను ఇంటికే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు, సచివాలయాల సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య కీర్తనలు



కీర్తనలతో అలరిస్తున్న శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాల్లో భాగంగా గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంగీతోత్సవాలను ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు అన్నమయ్య గీతాలు, వీణా వాయిద్యాలు అలరించాయి. శ్రీసాయి సురేఖ డాన్స్ అకాడమీ విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

షెల్టర్ లేని బస్టాప్



ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్

ఆరిలోవ: ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద షెల్టరు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. కొన్నేళ్లుగా ఇక్కడ బస్ స్టాప్ నిర్వహిస్తున్నారు. విశాలమైన స్థలం ఉంది. నగరం నుంచి ఆరిలోవకు వచ్చే బస్సుల అన్నింటికీ ఇదే ఆఖరి బస్ స్టాప్. ఆరిలోవ వచ్చే బస్‌లు అన్నీ ఇక్కడ నుంచే తిరిగి నగరానికి బయలుదేరుతాయి. ఆరిలోవ కాలనీ, ఆపరేషన్ కాలనీ, పాండురంగాపురం. కనకమహాలక్ష్మినగర్, నలబై గజాల రోడ్డు, జైభీం నగర్, లక్ష్మీపార్వతినగర్ తదితర కాలనీల నుంచి బస్‌లు, ఆటోల కోసం ప్రజలు ఇక్కడికే జనం వచ్చి, నిరీక్షిస్తుంటారు. అయితే వేచి ఉండేందుకు ఇక్కడ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుతం వర్షా కాలం కావడంతో ఎక్కువ వర్షం కురిసినప్పుడు మరింత ఇబ్బందిపడతామని ప్రయాణికులు అంటున్నారు. ఇక్కడ విశాలమైన స్థలం ఉందని, దానిలో ఏదోచోట రోడ్డు పక్కన బస్ షెల్టర్ నిర్మించాలని జీవీఎంసీ అధికారులను స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి, ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, తదితరులు ఈ సేవ నిర్వహించారు.

17 నుంచి కన్యకాపరమేశ్వరికి శ్రావణం పూజలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్ తదితరులు

దాబాగార్డెన్స్ : నగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల 15 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్, గ్రంథి రామకృష్ణారావు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో పలువురు ప్రముఖులచే ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాల్లో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రాతఃకాల ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, మహిళలచే వివిధ అమ్మవార్ల స్తోత్ర పారాయణ, సామూహిక శ్రీచక్ర సహిత కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. తొలి శుక్రవారం అమ్మవారికి పట్టు వస్త్రాలంకరణ, సామూహిక లలితా సహస్రనామ పారాయణ, 108 గోత్ర రుషి పూజలు ఉంటాయన్నారు. రెండో శుక్రవారం సువర్ణ వస్త్రాలంకరణ, నవ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు, మూడో శుక్రవారం ముత్యాల చీర అలంకరణ, నవ పుష్పాల పూజ, నాల్గవ శుక్రవారం రజిత వస్త్రాలంకరణ, 108 ద్రవ్యాలతో అమ్మవారి మూల విరాట్‌కు సహస్ర ఘటాభిషేకం, సామూహిక కుంకుమ పూజలు, ఐదో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్, ఆలయ కోశాధికారి సుగ్గు శివకుమార్, ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు వేదా కవిత తదితరులు పాల్గొన్నారు.